




ఎత్తయిన కొండల నుంచి జాలువారుతున్న జలపాతాలు

నల్లమల అందాలు

కనువిందు చేస్తున్న జలపాతాలు





రుద్రవరం, జూలై 20:

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో నల్లమల అడవులు పచ్చదనాన్ని పంచుతున్నాయి. జాలువారుతున్న జలపాతాలు వాహనదారులు, ప్రయాణికులను కట్టిపడేస్తున్నాయి. పాలవలె మంచుపొగతో కూడిన నీటి సోయగాలు కనువిందు చేస్తున్నాయి. ఎత్తయిన కొండలపై నుంచి జారి పడుతున్న వర్షం నీటి దృశ్యాలు ప్రతిఒక్కరినీ మైమరపింపజేస్తున్నాయి. నల్లమలలో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రుద్రవరం రేంజిలోని ఎగువ అహోబిలం దేవాలయం సమీపంలో ఉన్న ఎత్తయిన కొండల నుంచి సెలలోకి దూకుతున్న నీటి పరవళ్లు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చని వృక్షాలు, పక్షుల కిలకిలరావాలు, జలపాతాల జలసవ్వడులు ఇలా మొత్తంగా నల్లమల అందాలను ప్రకృతి ప్రేమికులు ఆస్వాదిస్తున్నారు. ఈ ప్రాంతానికి తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట



నల్లమల్ల అడవిలో అందాల జలపాతం

టిడ్కో కాలనీలపై కలెక్టర్ దృష్టి

మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశం



గృహ నిర్మాణశాఖ అధికారులతో సమావేశమైన కలెక్టర్

నంద్యాల (కల్చరల్), జూలై 20: టీడీపీ అధికారంలోకి రాగానే టిడ్కో గృహాలపై దృష్టి సారించింది. ఈమేరకు నంద్యాల జిల్లా వ్యాప్తంగా టిడ్కో గృహాల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. నంద్యాల, ఆళ్లగడ్డ, డోన్ పట్టణాల్లోని టిడ్కో కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి లబ్ధిదారులు ఇళ్లలో చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో గృహ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని ఎస్సార్బీసీ టిడ్కో కాలనీలో 2,096 గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. లబ్ధిదారులు ఆ గృహాల్లో చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా వంద రోజుల ప్రణాళికలో భాగంగా గృహాలను పూర్తిస్థాయికి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి గ్రామీణ స్వరాజ్ యోజన కింద సొంత స్థలాల్లో చేపట్టిన 12,655 గృహాల నిర్మాణం, పీఎం జన్మాన్ కింద గిరిజన ప్రాంతాల్లో నిర్మించే 451 గృహాల నిర్మాణాన్ని కూడా వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. గృహాలు నిర్మించుకొనే లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇటుక తదితర మెటీరియల్ సరఫరాలో ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పేమెంట్ బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చేయాలని ఆమె ఆదేశించారు.

విస్తారంగా వర్షాలు

- రుద్రవరంలో అత్యధికంగా 70.6 మిల్లీమీటర్ల వర్షం
- అత్యల్పంగా శ్రీశైలంలో 5మి.మీ. నమోదు

నంద్యాల టౌన్, జూలై 20: జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మేఘాలతో నాన్పుడు వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా సరాసరి 30.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రుద్రవరంలో అత్యధికంగా 70.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దొర్నిపాడులో 66.2, బనగానపల్లెలో 47.8, నంద్యాలలో 47.2, పాణ్యంలో 46.4, మహానందిలో 45.8, బండిఆత్మకూరులో 43.6, ఆళ్లగడ్డలో 41.0, కోవెలకుంట్లలో 40.0, శిరివెళ్లల్లో 39.0, గోస్పాడులో 35.2, నందికొట్కూరులో 32.2, బేతంచెర్లలో 27.4, పగిడ్యాలలో 24.8, సంజామలలో 24.0, ఉయ్యాలవాడలో 23.6, పాములపాడులో 23.4, గడివేములలో 23.4, అవుకులో 21.2, వెలుగోడులో 20.6, ఆత్మకూరులో 20.4, కొత్తపల్లెలో 20.2, చాగలమర్రిలో 20.0, మిడుతూరులో 19.6, జూపాడుబంగ్లాలో 18.4, ప్యాపిలీలో 18.2, డోన్‌లో 12.4, కొలమిగుండ్లలో 8.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా శ్రీశైలంలో 5.0 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.


ఆత్మకూరులో ఉధృతంగా ప్రవహిస్తున్న పడేవాగు



రుద్రవరంలో మొక్కు జొన్న పంటలో నిలిచిన వర్షపు నీరు



శ్రీశైలం జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో



శ్రీశైలం డ్యామ్

శ్రీశైలం, జులై 20: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైల జలాశయానికి శనివారం ఇన్‌ఫ్లో పెరిగింది. శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి జూరాల నుంచి 81,157 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 813.70 అడుగులు, జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 36.5568 టీఎంసీలుగా నమోదయింది. జలాశయం కుడి, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో ఎలాంటి విద్యుత్ ఉత్పత్తి జరగడం లేదు.

దుర్గమ్మకు శ్రీశైలం సారె



అమ్మవారికి సారె సమర్పణ కార్యక్రమంలో ఈవో పెద్దిరాజు దంపతులు

శ్రీశైలం, జులై 20: శ్రీశైలం దేవస్థానం ఆషాఢమాసం పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మ వారికి సారె సమర్పించారు. సంప్రదాయబద్ధంగా జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారికి పట్టుచీర, పూలు, పలు రకాల ఫలాలు, గాజులు మొదలైనవి సమర్పించారు. అలాగే మల్లేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. సారెతో కనకదుర్గ అమ్మవారి ఆలయానికి చేరుకున్న శ్రీశైలం దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు, సిబ్బందికి దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం తరపున అమ్మవారికి సారె సమర్పిం చారు. తరువాత దుర్గామల్లేశ్వరస్వామి వేదపండితులు వేదాశీర్వచనం పలికి శేషవస్త్రాలు, ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం ఈవో డి.పెద్దిరాజు దంపతులు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, ఏఈవో హరిదాసు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు జేసీ, కమిషనర్ బదిలీ

కర్నూలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తున్న నారపురెడ్డి మౌర్యను తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆమె గత వైసీపీ ప్రభుత్వంలో కర్నూలు జేసీగా ఇక్కడకు వచ్చారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాణ్యం నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్‌గా పని చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా గత ప్రభుత్వంలో బదిలీపై వచ్చిన భార్గవ్‌తేజను ప్రభుత్వం గుంటూరు జాయింట్ కలెక్టర్‌గా బదిలీ చేసింది. అయితే కర్నూలు జేసీ, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించలేదు. త్వరలోనే ఆ స్థానాలు భర్తీ చేసే అవకాశం ఉంది.

అధిక వర్షాలతో పంటలకు తెగుళ్ల ముప్పు

నంద్యాల టౌన్, జూలై 20:

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న అధిక వర్షాల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ పంటలను తెగుళ్ల ముప్పు వెంటాడుతోంది. ప్రస్తుత ఏడాది ఖరీఫ్ సీజన్‌కు జూన్‌లో అవసరమైన మేర వర్షపాతం కురవలేదు. జూలై రెండో వారం నుంచి పదును వర్షపాతం నమోదు కావడంతో పలు మండలాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం ఈ పంటలన్నీ 10-50 రోజుల వ్యవధిలో ఉన్నాయి. అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగులో ఉన్న వివిధ రకాల పంటలకు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందని, రైతులందరూ అప్రమత్తంగా ఉండి నివారణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ, నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పత్తి శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ వేర్వేరు ప్రకటనల్లో రైతులకు సూచించారు.

వేరు కుళ్లు, మచ్చ తెగుళ్ల బెడద

ఖరీఫ్‌లో ప్రధానంగా మొక్కజొన్న, కంది, మినుము, వేరుశనగ, పత్తి, ఉల్లితో పాటు వివిధ రకాల పండ్లు, కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తిపంట సరాసరి 10 రోజుల నుంచి 50 రోజుల వ్యవధిలో సాగు దశలో పంట ఉంది. తుఫాన్, మబ్బులతో కూడిన వాతావరణంతో వర్షం కురుస్తుండటం, సాగులో ఉన్న పంట పొలాల్లో నీరు నిల్వ చేరుతుండటంతో వేరు కుళ్లు, మచ్చ తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. తెగుళ్ల వల్ల పంట నష్టం జరగకుండా రైతులు జాగ్రత్తగా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలకు అనుగుణంగా నివారణ చర్యలు చేపట్టాల్సి ఉంది.



నీట మునిగిన పత్తి పంట

జాగ్రత్తలు ఇలా..

తెగుళ్లతో నష్టం కలగకుండా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా సాగులో ఉన్న పంటలు తెగుళ్లకు గురి కాకుండా నివారణ చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో వర్షపునీరు నిలబడినప్పుడు నీటిని కాల్వ తీసి పూర్తిగా తీసి వేయాలి. వర్షాలు ఆగిన తరువాత, పొలాలు ఆరిన తరువాత ఎకరానికి 25 కేజీల యూరియా, 25 కేజీల మ్యూరేట్‌ఆఫ్ పొటాష్ వేయాలి. పొటాషియం నైట్రేట్ (మల్టీ -కే) ఏకరానికి 2 కేజీలు, బోరాన్ 300 గ్రాములు, యూరియా 2 కేజీలు లేదా డై ఆమోనియం పాస్పేట్ 2 కేజీలు 200 లీటర్ల నీటిలో కలిపి మొక్కలు బాగా తడిసేటట్లు పిచికారీ చేయాలి. అధిక వర్షాల వల్ల పంటల్లో మొక్కలు, పూత, కాయలు ఎక్కువగా రాలిపోతుంటే రైతులు వెంటనే ప్లానోఫిక్స్ (ఎన్ఏఏ-10 పీపీఎం) ఎకరానికి 5 మిల్లీలీటర్లను 225 లీటర్ల నీటిలో కలిపి మొక్కలంతా బాగా తడిసేటట్లుగా పిచికారి చేసుకోవాలి. వేరుకుళ్ల, మొదలు కుళ్లు నివారణ చర్యల్లో మొదటగా మొదలు కుళ్ల, వేరుకుళ్ల ఆశించిన మొక్కలను తీసి వేయాలి. ఆ తరువాత కాపర్ ఆక్సీక్లోరైడ్ (బ్లైటాక్స్) ఎకరానికి 600 గ్రాములు, లేదా కార్బండిజం 400 గ్రాములు లేదా డైతేన్ -45ను 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పాదుల్లో బాగా తడిసేటట్లు పిచికారి చేసుకోవాలి. ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు ఎకరానికి కార్బండిజం 200 గ్రాములు, లేదా ప్రొపీకొనజోల్ 200 గ్రాములు లేదా హెక్సాకొనజోల్ 400 గ్రాములను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పత్తిలో పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక ఆశించే అవకాశం ఉందని, దీని నివారణకు ఫ్లొనిక్ అమైడ్ లేదా డైనేటోఫ్యూరాన్ 60 గ్రాములు ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. పత్తిలో గులాబీ రంగు పురుగు కనిపెట్టేందుకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఉంచాలని, తల్లి రెక్కల పురుగులు పడిన వెంటనే వేప నూనె 5 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని, 10 రోజుల తరువాత ప్రొఫినోఫాస్ 3 మిల్లీలీటర్లను ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని వ్యవసాయ అధికార యంత్రాంగం రైతులకు సూచించారు.

పార్టీ ఆదేశాలను ధిక్కరిస్తే కఠిన చర్యలు

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి హెచ్చరిక

కర్నూలు(అర్బన్), జూలై 20: 'అధిష్ఠానం అన్నీ గమనిస్తుంది.. పార్టీ ఆదేశాలు దిక్కరిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవు' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆలూరు నియోజకవర్గానికి చెందిన తెలుగుతమ్ముళ్లతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజులుగా సీనియర్ నాయకుడు వీరభద్రగౌడ్‌కు వ్యతిరేకంగా, అనుకులంగా జిల్లా పార్టీ కార్యాలయానికి భారీగా టీడీపీ శ్రేణులు తరలివచ్చి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ తరుణంలో టీడీపీ శ్రేణులతో తిక్కారెడ్డి చర్చించి ఇరువురి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని ఆదేశించారు. ఎవరికి కేటాయించిన పనులు వారు చేసుకుంటూ పోవాలన్నారు. పార్టీలో అసమ్మతి సహజంగానే ఉంటుందని, అందరు కలిసి కూర్చొని చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకుంటూ పోతే పార్టీ మరింత బలపడుతుందని నాయకులకు వివరించే ప్రయత్నం చేశారు. అంతర్గత కుమ్ములాటలు ఉంటే ప్రత్యర్థులు బలపడే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అందరం కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు.

గుంతకల్లు వెస్ట్ - మల్లప్పగేట్ డబుల్ రైల్వేలైన్ పనుల్లో పురోగతి

● భూసేకరణకు నోటీస్ జారీ చేసిన రైల్వే శాఖ
● చిప్పగిరి మండలంలో 29 ఎకరాల సేకరణ

కర్నూలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్, రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబుల్ లైన్ నిర్మాణంలో భాగంగా గుంతకల్లు వెస్ట్ - మల్లప్ప గేట్ మధ్య డబుల్ రైల్వేలైన్ నిర్మాణం కోసం సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. మండల కేంద్రమైన చిప్పగిరి గ్రామం పరిధిలో 21.31 ఎకరాల ప్రైవేటు భూమి, 2.25 ఎకరాల అసైన్డ్ ల్యాండ్, 2.91 ఎకరాల ప్రభుత్వ భూమి, దౌలతాపురం గ్రామంలో 8.08 ఎకరాల ప్రైవేటు భూమి, నంచర్ల గ్రామంలో 0.10 ఎకరాల ప్రైవేటు భూమి కలిపి 29.49 ఎకరాలు. ప్రైవేటు భూమి 2.55 ఎకరాలు, అసైన్డ్ ల్యాండ్ 2.91 ఎకరాలు ప్రభుత్వ భూమిని సేకరించనున్నారు. ఏ రైతు ఎంత భూమి కోల్పోతున్నారో సర్వే నంబర్ల వారీగా భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేశారు. అభ్యంతరాలు ఉన్న రైతులు రాతపూర్వకంగా 30 రోజుల్లోగా భూ సేకరణ అధికారి పత్తికొండ ఆర్డీవోకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), జూలై 20: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పాములపాడులో వ్యక్తి దారుణ హత్య

పాములపాడు, జూలై 20: పాములపాడులో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఆత్మకూరు అర్బన్ సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇస్కాల గ్రామానికి చెందిన చిన్న లింగ స్వామి అలియాస్ ఎర్రన్న (46)ను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. లింగస్వామి గత సంవత్సరం క్రితం పాములపాడు గ్రామంలో ఓ అద్దె భవనంలో నివాసం ఉంటూ పొట్టేళ్ళ వ్యాపారం చేస్తుండేవాడని సీఐ తెలిపారు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో లింగ స్వామికి ఫోన్ కాల్ రాగానే ఆయన వెంటనే బయటికి వెళ్లాడు. లింగ స్వామి రాత్రి పది దాటినా ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అనుమానం వచ్చి బంధువులతో కలిసి వెతికారు. చెలిమిల్ల రస్తా దారిలో ఎస్సార్బీసీ కాలువ సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. ఈ సంఘటనపై లింగస్వామి భార్య చిట్టెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి

న్యాయాధికారి లీలా వెంకట శేషాద్రి



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

కర్నూలు(లీగల్), జూలై 20: బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి కోరారు. ఈ మేరకు స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో బాలల న్యాయ చట్టంపై శనివారం ఒక న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల విషయంలో అంతర్జాతీయ ఒడంబడిక మేరకు రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబంధనలపై పోలీసులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాలల్లో నేరస్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సిలింగ్, విద్యాబోధన ద్వారా మార్పు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారి పి. జ్యోత్స్నాదేవి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్. మనోహర్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ జుబేదా బేగం తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వండి

ఆర్‌యూ ఉపకులపతి ఎన్‌టీకే నాయక్



ఆర్‌యూలో హాస్టళ్లను పరిశీలిస్తున్న ఉపకులపతి

కర్నూలు(అర్బన్), జూలై 20: హాస్టళ్లలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. శనివారం హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీ హాస్టళ్లలో పరిసరాలను శుభ్రం చేసే పనుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వర్సిటీ లైఫ్ సైన్సు విభాగాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులు, అధ్యాపకుల హాజరును పరిశీలించారు. తరగతులు జరుగుతున్న విధానాన్ని గమనించారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు కూడా సమయపాలన పాటించి పాఠ్యాంశాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలన్నారు. నాల్గవ సెమిస్టర్ పరీక్షలు సోమవారంతో పూర్తవుతాయని, త్వరలో ప్రారంభం కానున్న రెండో సెమిస్టర్ పరీక్షలకు విద్యార్థులంతా శ్రద్ధ చదువుకోవాలని సూచించారు.

ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు

సి.బెళగల్, జూలై 20: మండలంలోని చింతమానుపల్లె గ్రామంలో మొహర్రం పండుగ రోజున వైసీపీ నాయకులు, టీడీపీ నాయకులు ఘర్షణ పడ్డారు. రెండు వర్గాల ఫిర్యాదు మేరకు టీడీపీ, వైసీపీ ఇరువర్గాలైన టీడీపీకి చెందిన రాజు వర్గానికి చెందిన ఆరుగురిపై, వైసీపీకి చెందిన నరసింహ నాయుడు వర్గానికి చెందిన 9 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నది తీర గ్రామాలైన తిమ్మనదొడ్డి, సంగాల, గుండ్రేవుల, కొండాపురం, పల్దొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె, శింగవరం, కొత్తకోట గ్రామాలలో పర్యటించి నదీతీరా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ నదీతీర పొలాలు ఉన్న రైతులు విద్యుత్ మోటార్లను ఎగువ ప్రాంతానికి తరలించాలన్నారు.

ముచ్చుమర్రి ఉదంతంలో అనూహ్య ఘటన

● విచారణలోని వ్యక్తి అనుమానాస్పద మృతి
● నంద్యాల జీజీహెచ్‌కు మృతదేహం తరలింపు
● గోప్యంగా వ్యవహరించిన పోలీసులు
● మీడియాను, రోగులను ఆసుపత్రిలోకి అనుమతించని వైనం



మృతి చెందిన హుసేని



మృతుడి శరీరంపై గాయాలు

నంద్యాల నూనెపల్లె/ నందికొట్కూరు, జూలై 20: నందికొట్కూరు నియోజకవర్గం ముచ్చుమర్రి బాలిక ఉదంతంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. కేసు విచారణలో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో ఓ వ్యక్తి శనివారం తెల్ల వారుజామున అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. బాలిక వాసంతిని అత్యాచారం చేసి, హతమార్చిన వారిలో ఓ బాలుడి మేనమామలు హుసేని(34), ఏసును నంద్యాల సీసీఎస్ పోలీసులు విచారణ నిమిత్తం రెండు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అయితే పోలీసులు విచారణలో ఉన్న హుసేని అస్వస్థతకు గురయ్యాడు. అప్రమత్తమైన పోలీసులు అతడిని నంద్యాలలోని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. శనివారం ఉదయం 8:45 నిమిషాలకు హుసేనిని పోలీసులు ఆసుపత్రికి తీసుకురాగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. హుసేని మృతదేహాన్ని క్యాజువాలిటీలోనే ఉంచగా మీడియాను, చికిత్సకోసం వచ్చిన రోగులను లోపలికి అనుమతించలేదు. ఇదిలా ఉండగా మృతుడి శరీరంపై పోలీసుల లాఠీ గాయాలు ఉండటం పలు అనుమానాలకు దారి తీస్తోంది. ఆసుపత్రి ఆవరణంలో దాదాపు 20 మంది సీఐలు మరికొంత మంది ఎస్ఐలు, సీసీఎస్, ఎస్బీ, ఇంటెలిజెన్స్ పోలీస్ సిబ్బంది అధిక సంఖ్యలో చేరుకున్నారు. జరిగిన ఘటనపై నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, అక్కడున్న సీఐలను పాత్రికేయులు వివరణ కోరగా తమకేమి తెలియదని చెప్పారు. హుసేని మృతదేహాన్ని గుట్టు చప్పుడుకాకుండా మీడియా కన్నుగప్పి ఆసుపత్రి వెనుక బాగం నుంచి మార్చురి గదికి పోలీసులు తరలించారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు మృతుడి కుటుంబ సభ్యులు ఆసుపత్రి వైపు రాకపోవడం కూడా పోలీసుల తీరుపై పలు అనుమానాలను రేకెత్తిస్తున్నాయి. నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి ఆసుపత్రి మార్చురీ గదిలో హుసేని మృతదేహాన్ని పరిశీలించాలని డిమాండ్ చేశారు. వాసంతి ఘటనను సీబీసీఐడీతో విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా గత నాలుగేళ్లుగా హుసేని తన అక్కతో కలసి నందికొట్కూరులోని ఆత్మకురు రోడ్డులో ఉన్న బైరెడ్డి నగర్‌లో జీవనం సాగిస్తున్నాడు. హుసేనికి రెండు వివాహాలు జరగ్గా వారిద్దరితోనూ విడాకులు తీసుకున్నాడు.

వెనువెంటనే అంత్యక్రియలు : హుసేని అంత్యక్రియలు కూడా వెనువెంటనే జరిగిపోయాయి. ఆయన మృతదేహానికి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి తరలించారు. హుసేని కుటుంబసభ్యులు, బంధువుల సమక్షంలో శనివారం రాత్రి అంత్యక్రియలు పూర్తయ్యాయి.



డీటీహెచ్ క్యాజువాలిటీ వద్ద రోగులను లోపలికి అనుతించని దృశ్యం

ఎస్పీ ఏమన్నారంటే...



నంద్యాల క్రైం, జూలై 20: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో బాలిక అదృశ్యం కేసులో నిందితుడు హుసేని మృతిపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శనివారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసులో అనుమానితుడిగా ఉన్న హుసేనిని నంద్యాల పట్టణ శివారు మసీదుపురం మెట్ట వద్ద అదుపులోకి తీసుకున్నా మన్నారు. విచారణలో భాగంగా నందికొట్కూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మిద్దూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో తలముడిపి బాట వద్ద నిందితుడు పోలీస్ జీపులో నుంచి దూకి పారిపోయేందుకు యత్నించాడన్నారు. నిందితుడిని వెంబడించి పట్టుకోగా ఆయాసంతో గుండె నొప్పి ఉందని హుసేని చెప్పాడన్నారు. వెంటనే అతడిని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మార్గమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారని ఎస్పీ వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి మిడుతూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాకు చెందిన డీఎస్పీ స్థాయి అధికారిని దర్యాప్తు అధికారిగా ఉన్నతాధికారులు నియమించారని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ శవ పంచనామా నిర్వహించారని ఎస్పీ తెలిపారు. మృతుడు హుసేన్ గత కొంత కాలంనుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు శవ పంచనామా సమయంలో మెజిస్ట్రేట్ ముందు మృతుడి బంధువులు చెప్పారని ఎస్పీ పేర్కొన్నారు. కేసు నిష్పక్షపాత దర్యాప్తులో భాగంగా డాక్టర్ల బృందంతో పోస్టుమార్టం చేయించామని, మొత్తం పోస్టుమార్టం ప్రక్రియను వీడియోగ్రఫీ చేయించినట్లు వెల్లడించారు. చట్ట ప్రకారం అన్ని నియమ, నిబంధనలు పాటించి ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు.

పందికోన రిజర్వాయర్ చేపల వేలం వాయిదా

● తమ గ్రామానికి సమాచారం లేదని అడ్డుకున్న కొత్తపల్లి గ్రామస్థులు
● 25 మంది చెల్లించిన ధరావత్తు తిరిగి చెల్లింపు



మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లాఅధికారి శ్యామల



మూసివేసిన గేటుబయట గ్రామాల ప్రజలు

పత్తికొండ, జూలై 20: పందికోన రిజర్వాయర్ చేపల వేలం ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఈనెల 31కి వాయిదా పడింది. పందికోన రిజర్వాయర్‌లో ఏడాదిపాటు చేపల పెంపకం, అమ్మకాలకు సంబంధించి శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశభవనంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్యామల ఆధ్వర్యంలో నిర్వహించారు. 12గంటల వరకు వేలాల్లో పాల్గొనే వారు ధరావత్తు చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని ప్రకటించారు. మొత్తం 25 మంది రూ10 వేల ధరావత్తు చెల్లించి వేలంపాటకు సిద్ధం అయ్యారు. అయితే తమ గ్రామానికి ఎలాంటి సమాచారం అందించకుండా నిర్వహిస్తున్నందు వల్ల చేపల వేలాలు నిలిపివేయాలంటూ కొత్తపల్లికి చెందిన నాయకులు మత్స్యశాఖ అధికారితో వాగ్వివాదానికి దిగారు. 10 రోజల ముందే అందరికీ వేలాల గురించి సమాచారం ఇచ్చామని, వార్తాపత్రికల్లో సైతం వార్తలు వచ్చాయని, తీరా వేలాలు జరుగుతున్న సమయంలో ఇలా అడ్డుకోవడం సరికాదని వారికి మత్స్యశాఖ అధికారి సమాధానం ఇచ్చారు. అయినప్పటికీ వారు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వారిని బయటికి పంపించి 12 గంటలకు వేలాలు ప్రారంభిస్తామని పాటదారులకు ఆమె తెలియచేశారు. రిజర్వాయర్ సమీపంలో ఉన్న గ్రామాలైన పందికోన-కొత్తపల్లి గ్రామాల నడుమ సయోధ్య కోసం వేలాలను వాయిదావేసి కొంత సమయం అందించాలని టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారిని కోరారు. దీంతో పై అధికారులతో మాట్లాడిన అనంతరం మత్స్యశాఖ అధికారి శ్యామల వేలాలు ఈనెల 31కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. 31వ తేదిలోగా సమస్యను పరిష్కరించుకుని రెండు గ్రామాల ప్రజలు వేలాలకు, చేపల పెంపకానికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డీఈ చంద్రయ్య, తహసీల్దార్, ఎంపీడీవో రామారావు, సీఐ మురళీమోహన్ ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయం గేట్లు మూసివేత..

చేపల వేలాలను అడ్డుకునేందుకు కొత్తపల్లి గ్రామస్థులు సిద్ధం కావడంతో సీఐ మురళీమోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వేలాలు నిర్వహిస్తున్న సమావేశ భవనంలోకి వేలం పాటదారులు, మీడియా ప్రతినిధులను మాత్రమే అనుమతించారు. కార్యాలయం ఆవరణలో ఉన్న ప్రజలు లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు వారిని బయటికి పంపి గేట్లు మూసివేశారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య



హనుమంతమ్మ (ఫైల్)

కోసిగి, జూలై 20: మండల పరిధిలోని తుమ్మిగనూరు గ్రామంలో కొండ హనుమంతమ్మ (28) అనే మహిళ శనివారం నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మండల పరిధిలోని దేవరబెట్ట గ్రామానికి చెందిన కొండ రామాంజనేయులుతో హనుమంతమ్మకు ఐదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. గత నెల జూన్ 26న తుంగభద్ర రైల్వేస్టేషన్ సమీపంలో ఏడాది వయస్సున్న తన కుమారుడు విశ్వనాథ్‌ను హనుమంతమ్మ గొంతు నులిమి చంపేసింది. ఆమె కూడా గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్యకు ప్రయత్నించడంతో పక్కనే ఉన్న స్థానికులు, కుటుంబ సభ్యులు కలిసి అడ్డుకున్నారు. కుమారుడిని హత్య చేసినప్పటి నుంచి భార్యను భర్త చేరదీయలేదు. అప్పటి నుంచి భార్య పుట్టినిల్లయిన తుమ్మిగనూరు గ్రామంలోనే ఉంటోంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో హనుమంతమ్మ చీరకు నిప్పంటించుకుని ఆత్మహత్యకు చేసుకుంది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేకపోవడం వల్లే ఇలా చేసినట్టు తెలుస్తోంది. ఎస్ఐ సతీష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ యం.ఉమాపతి



కరపత్రాన్ని విడుదల చేస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ

కల్లూరు, జూలై 20: వర్షాకాలంలో వినియోగదారులు, రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఉమ్మడి కర్నూలు జిల్లా ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి పేర్కొన్నారు. శనివారం నగరంలోని విద్యుత్ భవన్‌లో ఆయన సమావేశం నిర్వహించి అధికారులు, వినియోగదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ పవర్ కట్ ఉన్న ప్రాంతాల్లో వినియోగదారులు, రైతులు ట్రాన్స్‌ఫార్మర్, ఏబీ స్విచ్‌ల వద్ద సొంతంగా రిపేరి చేయకూడదన్నారు. వెంటనే విద్యుత్‌శాఖ ఏఈ, లైన్‌మెన్‌కు గాని 1912 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని అన్నారు. మోటార్లు, స్టార్టర్ల వద్ద రబ్బరు మ్యాట్ ఉపయోగిస్తే ప్రమాదాలు నివారించవచ్చని ఎస్ఈ సూచించారు. విద్యుత్‌శాఖ అధికారులు తమకు కేటాయించిన మండల హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉండాలన్నారు. కండక్టర్లపై ప్లాస్టిక్ పైపులు వేయరాదని, వినియోదారులు గృహాల్లో ఉపయోగించే విద్యుత్ వైర్లు, స్విచ్‌లు, హోల్డర్లు ఐఎస్ఐ గుర్తింపు పొందిన పరికరాలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఈఈ, కర్నూలు డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ పి. ఓబులేసు, టెక్నికల్ ఏడీఈ విజయ భాస్కర్, విజిలెన్స్ సీఐ పార్థసారథిరెడ్డి, ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

జగన్...శవ రాజకీయాలు మానుకో

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు(అర్బన్), జూలై 20: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో ఎంతో మంది ప్రాణాలను హరించి, రాష్ట్ర ప్రజలకు రక్షణ లేకుండా చేసిన వైఎస్ జగన్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేయడాన్ని తప్పుపట్టారు. వినుకొండలో వ్యక్తిగత కక్షలతో రషీద్ అనే వ్యక్తి మరణిస్తే దానిని తన రాజకీయ స్వార్థం కోసం ఉపయోగించుకునేందుకు జగన్మోహన్‌రెడ్డి శవ రాజకీయాలను చేస్తున్నారని విమర్శించారు. సీబీఐ కేసుల్లో కోర్టుకు హాజరుకాకుండా కుంటి సాకులు చూపిస్తున్న జగన్‌ను తక్షణమే అరెస్టు చేసి జైలుకు పంపాలని ఆయన డిమాండ్ చేశారు.

కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు పీఠాధిపతి సన్మానం



కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో మాట్లాడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 20: మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను ఘనంగా సన్మానించారు. శనివారం బెంగుళూరులోని నిరంజన జగద్గురు సిద్ధరామేశ్వర స్వామీజీ దీక్షా మహోత్సవం పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ప్రత్యేక సభలో ముఖ్య అతిథి సీఎం సిద్ధరామయ్యను మంత్రాలయం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు సన్మానించారు. ఈ సందర్భంగా కర్ణాటక సీఎం సిద్ధరామయ్యతో మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ద్వార పాలక అనంతస్వామి, ప్రకాషాచార్, భీమ్‌సేన్‌రావు, పవనాచార్ పాల్గొన్నారు.

కేసీ కాలువకు గండి



చాగలమర్రి సమీపంలో కేసీ కాలువకు పడిన గండి

చాగలమర్రి, జూలై 20: చాగలమర్రి గ్రామ సమీపంలోని 11 కమాండ్ల వద్ద కేసీ కాలువ కోతకు గురై శనివారం గండి పడింది. ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో కేసీ కాలువ మట్టి కట్ట కోతకు గురైంది. కమాండ్ల వద్దగల సైడ్‌వాల్ కుంగిపోయింది. రాజోలి ఆనకట్ట నుంచి కేసీ కాలువకు లీకేజీ నీరు కాలువ వెంట ప్రవహిస్తోంది. ఈ నీరు గండిపడ్డ చోట కాలువలోకి వెళ్తోంది. భారీ వర్షాలు కురిస్తే భారీ గండిపడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సైడ్‌వాల్, కేసీ కాలువ మరమ్మతు పనులు తక్షణమే చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

డీఐజీని కలిసిన టీడీపీ నాయకులు



డీఐజీని కలిసిన ఎమ్మెల్యే జయసూర్య, మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు, జూలై 20: కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్‌ను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను డీఐజీ దృష్టికి తీసుకెళ్లారు. డీఐజీని కలిసిన వారిలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి ఉన్నారు.

జవాబుదారీగా పని చేయాలి: ఎమ్మెల్యే

పాములపాడు జూలై 20: ప్రభుత్వ అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజలకు జవాబుదారీ తనంతో పని చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ జరోజిని వర్ధినియా ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరయ్యారు. సమావేశంలో ఆయా వాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ హాజరుకాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి పనుల్లో అనేక అవకతవకలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. సుదూర ప్రాంతాల్లో ఉన్నవారికి మస్టర్ వేసి కూలీలు వేసి చెల్లిస్తున్నారని తీరు మార్చుకోవాలన్నారు. రుద్రవరం గ్రామంలో హైవేలు కోల్పోతున్న పాఠశాల భవనంపై సొంత నిర్ణయాలు తీసుకోకూడదని ఎంఈవోను హెచ్చరించారు. పలు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'ప్రాజెక్టుల ఆవశ్యకతపై అసెంబ్లీలో చర్చిస్తా'

నందికొట్కూరు, జూలై 20: సాగునీటి ప్రాజెక్టుల ఆవశ్యకతపై సోమవారం నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తానని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆయన మాట్లాడుతూ మిద్దూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి మిద్దూరు మండలానికి సాగునీరు అందిస్తామని చెప్పిన హామీపై అసెంబ్లీలో చర్చిస్తానన్నారు. అలాగే నందికొట్కూరు నియోజకవర్గంలో కేసీ కాలువపై ఆధారపడి జీవించే వారి సంఖ్య ఎక్కువని అన్నారు. కేసీ కాలువకు సాగునీటి సమస్య లేకుండా ఉండాలంటే ఒకే ఒక్క పరిష్కారం గుండ్రేవుల నిర్మాణమేనని అన్నారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం ఆవశ్యకతను కూడా అసెంబ్లీలో చర్చిస్తానన్నారు.

'రాష్ట్రపతి పాలన కోరడం సిగ్గుచేటు'

పాణ్యం, జూలై 20: వైసీపీ రాష్ట్రపతి పాలన కోరడం సిగ్గుచేటని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదేళ్ల కాలంలో సర్వనాశనం చేసి ఇప్పుడు రాష్ట్రపతి పాలన కోరుతున్న జగన్‌ను ప్రజలు ఎందుకు పక్కన పెట్టారో ఆలోచించుకోవాలన్నారు. జగన్ పాలనలో రౌడీయిజం, భూకబ్జాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, సౌండ్ వైన్, అక్రమ మైనింగ్, గంజాయి మాఫియాతో రాష్ట్రం రాక్షస పాలనగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. దీంతో కూటమికి అఖండ విజయాన్ని అందించారన్నారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ కుళ్లు రాజకీయాలు చేస్తుండడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇంకా జగన్ మారకపోవడం విచారకరంగా ఉందన్నారు. హంతకులను పక్కన పెట్టుకొని పరామర్శలకు వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. తుగ్లక్ పాలనతో రాష్ట్రం 30ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. ప్రజలు నమ్ముతున్నారనే భ్రమలో జగన్ ఉండడం విచారకరమన్నారు.

'పంట సంరక్షణ చర్యలు తప్పనిసరి'

కొత్తపల్లి, జూలై 20: ప్రస్తుతం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో పంట పొలాల్లో వర్షం నీరు నిల్వ ఉంటుందని, పంట సంరక్షణ కోసం పూర్తిగా తొలగించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేష్ రైతులకు సూచించారు. కొత్తపల్లిలో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటంతో పంట పొలాల్లో నీరు అధికంగా చేరి పంటలు కుళ్లిపోయే ప్రమాదం ఉందన్నారు.

'రక్తదానం సామాజిక బాధ్యత'



రక్తదాతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 20: రక్తదానం సామాజిక బాధ్యత అని ఆత్మకూరు సామాజిక వైద్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాయుడు, ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి జిల్లా రక్తనిధి వారి ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రక్తదానం వల్ల అనర్థాలేవి జరగవని, 60ఏళ్లలోపు ఎలాంటి దీర్ఘకాలిక జబ్బులు లేని వారు రక్తదానం చేయవచ్చునని తెలిపారు. డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. రక్తదాతలకు వారు ప్రశంసా పత్రాలను అందజేశారు. వైద్య సిబ్బంది సుజాత, రత్నాకర్, నాగేశమలు, ప్రసాద్, రవికుమార్, జబీవుల్లా తదితరులు ఉన్నారు.

'ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'

గడివేముల, జూలై 20: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ ఖలీల్‌పాష సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడిన, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన విద్యుత్‌శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. స్తంభాలను, విద్యుత్ తీగలను తాకవద్దని సూచించారు. రైతులు విద్యుత్ మోటార్లు స్విచ్ ఆన్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

'ఆధార్ సేవలను వినియోగించుకోండి'

వెలుగోడు, జూలై 20: వెలుగోడు మండలంలో ఈ నెల 23 నుంచి 26వ తేది వరకు గ్రామ సచివాలయాలలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 23 వ తేదీన రేగడ గూడూరు 1, అబ్దుల్లాపురం గ్రామ సచివాలయాలలో, 24న మోతుకూరు, బోయరేవుల గ్రామాలలో, ఈ నెల 25న వెలుగోడు సచివాలయం1,2లలో 26న వెలుగోడు సచివాలయంలె 3,4,5 తేదీల్లో నిర్వహిస్తున్నామన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న నోడల్ ఆఫీసర్

మహానంది, జూలై 20: మహానంది సమీపంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆర్బీఎస్‌కే నోడల్ అధికారి డాక్టర్ కాంతారావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయిలు, విద్యార్థులతో చర్చించారు. అనంతరం విద్య బోధన పనితీరును తెలుసుకొన్నారు. భోజనాన్ని తనిఖీ చేశారు. పరిసరాల్లోని నీటి ట్యాంక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ



వేల్పనూరులో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

బండిఆత్మకూరు, జూలై 20: కుష్టు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. మండలంలోని లింగాపురం గ్రామంలో శనివారం ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అన్ని రకాల రికార్డులు పరిశీలించారు. గ్రామంలో ప్రతి రోజు 25 ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలన్నారు. వైద్య సేవలు అందించటంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది వనజ, శృతి, అంకమ్మ, శివగంగ, సుమలత పాల్గొన్నారు.

'విధుల్లో నిర్లక్ష్యం వద్దు'

వెలుగోడు: వైద్యాధికారులు, వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన వేల్పనూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సీజన్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. అలాగే అబ్దుల్లాపురం గ్రామంలో జరుగుతున్న ఎఫ్‌టీ ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకు ప్రజలకుఅ ందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జహీర్ వలి, ప్రణీత్, ఎంపీహెచ్వఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నాణ్యతలేని ఆహారం అందిస్తే చర్యలు'



హోటల్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ అంకిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి

నంద్యాల టౌన్, జూలై 20: నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు, చెడిపోయిన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందిస్తే ఆయా హోటళ్లపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ శివప్రసాద్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సంజీవనగర్‌లో ఉన్న సవిత వెజ్ రెస్టారెంట్, రాజధాని బార్ అండ్ రెస్టారెంట్‌లలో ఆహార పదార్థాల తయారీ, కిచెన్, నిల్వకు వినియోగిస్తున్న ఫ్రిజ్‌లు, కిచెన్‌ను తనిఖీ చేశారు. కిచెన్‌ను అపరిశుభ్రంగా ఉంచడంపై హోటళ్ల యజమానులను హెచ్చరించారు. పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. చెడిపోయిన ఆహార పదార్థాలను కస్టమర్లకు అందిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'ఆయిల్ పామ్ సాగు లాభదాయకం'



మాట్లాడుతున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు

మిడుతూరు, జూలై 20: తక్కువ పెట్టుబడితో ఆయిల్ పామ్ సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు అన్నారు. మిడుతూరు వ్యవసాయ కార్యాలయంలో శనివారం రైతులకు మండల వ్యవసాయ అధికారి పీరునాయక్ అధ్యక్షతన ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి మాట్లాడుతూ నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని సూచించారు. ఈఆయిల్‌ఫామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు పంట నిర్వహణ ఖర్చులకు ఏడాదికి హెక్టారుకు రూ.5500 ఇస్తుందని చెప్పారు. నాలుగేళ్ల వరకు అంతర పంటలు సాగుచేసుకోవచ్చు చెప్పారు. అనంతరం మిడుతూరు గ్రామంలో ఆయిల్ పామ్ సాగును వ్యవసాయాధికారులు, రైతులు సందర్శించి పరిశీలించారు. ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వ్యసాయ అధికారును సంప్రదించాలని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, శివరామి రెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి జ్యోతి, జోనల్ మేనేజరు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకుడు



ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న కృష్ణయాదవ్

గడివేముల, జూలై 20: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి గౌరు చరితమ్మ ఎమ్మెల్యేగా గెలిస్తే తెలంగాణ బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో 101 టెంకాయలు కొడతానన్న మొక్కును టీడీపీ బీసీ సెల్ పాణ్యం నియోజకవర్గ అధ్యక్షుడు కృష్ణయాదవ్ శనివారం తీర్చుకున్నారు. అనంతరం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు శ్రీనివాస యాదవ్, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

ఆత్మకూరు, జూలై 20: ఆత్మకూరు పట్టణంలో వెలసిన షిర్డీ సాయి బాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ ముమ్మరంగా ఏర్పాట్లను సిద్ధం చేస్తోంది. భక్తులకు మధ్యాహ్నం 11.30గంటల నుంచే అన్నదాన కార్యక్రమం, రాత్రి 9గంటలకు శేజ్‌హారతి చేపట్టనున్నారు. క్యూలైన్లను, అన్నదాన కేంద్రాల ఏర్పాట్లపై దృష్టి సారించారు. అలాగే ఆలయాన్ని విద్యుత్, పుష్పాలంకరణతో సుందరీకరించనున్నారు. మధ్యాహ్నం 3.30గంటలకు స్థానిక సాయిబాబా ఆలయం వద్ద రథంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఆ తర్వాత రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలను జరపనున్నారు.

'కనీస సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి'

మహానంది, జూలై 20: అబ్బీపురం చెంచు కాలనీపై ప్రత్యేక దృష్టి పెడతామని ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. అబ్బీపురం చెంచు కాలనీలోకి వరద రావడంతో చెంచులు వీధుల్లోకి వచ్చారు. దీనిపై వివిధ ప్రజా సంఘాలు శనివారం ఎం.తిమ్మాపురంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. దీంతో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, పంచాయతీరాజ్ అధికారి రాముడు, పంచాయతీ కార్యదర్శి శ్రీదివ్య చెంచుకాలనీని సందర్శించారు.

'త్యాగానికి ప్రతీక మొహర్రం'



మౌళాలి స్వామిని దర్శించుకుంటున్న ఎన్ఎండీ ఫిరోజ్

గోస్పాడు, జూలై 20: త్యాగానికి మొహర్రం పర్వదినం ప్రతీక అని, కులమతాలకు అతీతంగా, సోదర భావంతో హిందువులు, ముస్లింలు మొహర్రంను నిర్వహించుకుంటున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మౌలాలి స్వామి జయారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాజులపల్లిలో జార్తులు

మహానంది: మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో శనివారం మౌలాలి స్వామి జార్తులను ఘనంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో మౌలాలి స్వామికి ప్రత్యేక ఫాతేహాలు, గంధాన్ని సమర్పించారు. శుక్రవారం రాత్రి మౌళాలి స్వామి అగ్ని ప్రవేశానికి వేలాదిమంది భక్తులు పాల్గొని కన్నుల విందుగా వేడుకలను నిర్వహించారు రాత్రి నుంచి ఉదయం వరకు పీరును గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి, రూరల్ సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

'మౌలిక వసతుల కల్పనకు నివేదిక పంపుతాం'

బండిఆత్మకూరు, జూలై 20: జిల్లాలో పలు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వానికి నివేదికలు పంపుతామని హౌసింగ్ ఈఈ హరిగోపాల్ తెలిపారు. శనివారం ఆయన బండిఆత్మకూరులోని జగనన్న కాలనీని పరిశీలించారు. రోడ్లు, డ్రైన్ల ఏర్పా టుకు కృషి చేస్తామన్నారు. నీరు నిలిచి ఉండటం, కంప పెరగటంపై ఈఈ అసంతృప్తి వ్యక్తం చేశారు. డీఈ రాజారఘువర్మ, ఎంపీడీవో విజయరావు, ఇన్‌చార్జి ఏఈ వాసుదేవుడు, సిబ్బంది జకిరియా, చెన్నయ్య, హరి పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలకు ఏర్పాట్లు

మహానంది, జూలై 20: ఆషాడ పౌర్ణమి పురస్కరించుకొని మహానందిలో ఆదివారం చేపడుతున్న శాకంబరి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు రవిశంకర్ అవధాని శనివారం తెలిపారు. నంద్యాలకు చెందిన లక్కబోయిన ప్రసాద్ దంపతులు ఆలయం ప్రాంగణంలోని కామేశ్వరిదేవి అమ్మవారికి నిర్వహించే శాకంబరి అలంకారంకు వివిధ రకాల కూరగాయాలను శనివారమే పంపినట్లు చెప్పారు. వీటిని బాలాజి సేవా సమితికి చెందిన 50 మంది మహిళలు దండలుగా కుట్టినట్లు చెప్పారు.

'ఆడపిల్లలపై వివక్ష వద్దు'

కొత్తపల్లి, జూలై 20: చిన్నప్పటి నుంచే ఆడపిల్లల పట్ల తల్లిదండ్రులు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, వారిపై ఎలాంటి వివక్ష చూపొద్దని కొత్తపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. మండలంలోని సింగరాజుపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'బాలసభ' నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ ముఖ్యంగా ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా వారిని కూడా మగపిల్లలకు ధీటుగా చదివించాలని సూచించారు. అలాగే రక్తహీనతకు గురి కాకుండా బాలికలను ఎలా సంరక్షించుకోవాల్సిన అంశంపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు హరిత, అంకమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఆత్మకూరులో మోస్తరు వర్షం

ఆత్మకూరు, జూలై 20: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావం కారణంగా ఆత్మకూరు ప్రాంతంలో శనివారం కూడా మోస్తారు వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు అడపాదడపా వర్షం కురియడంతో పట్టణమంతా చిత్తడిగా మారింది. ప్రత్యేకించి పట్టణంలోని పలు లోతట్టు కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. పలు ప్రాంతాల్లోని రహదారులపై వర్షపునీరు నిలిచిపోవడంతో జనం ఇక్కట్లకు లోనయ్యారు. ఇదిలావుంటే పట్టణ శివార్లలోని భవనాశి, పడేవాగు ఉధృతంగా ప్రవహించాయి.

నీటికుంటలా జగనన్న కాలనీ



నీటికుంటలా మారిన బండిఆత్మకూరు జగనన్న కాలనీ

బండిఆత్మకూరు, జూలై 20: బండిఆత్మకూరులో జగనన్న కాలనీ ముళ్లపొదలు, నీళ్ల గుంటలతో నిండిపోయింది. గత వైసీపీ ప్రభుత్వం 119 మందికి జగనన్న ఇళ్లు మంజూరు చేసింది. అయితే ఇందులో 26 ఇళ్లు బీఎల్, 30 లింటల్ లెవెల్, 3 రూఫ్ లెవెల్, 8 ఇళ్లు పూర్తయ్యాయి. కాలనీ మొత్తం వర్షపు నీరు నిలిచి నీటి కుంటలను తలపిస్తున్నాయి. ముళ్లపొదలు ఏకంగా అడవిని తలపిస్తున్నాయి.

అధికారులతో ప్రజల వాగ్వాదం



అధికారులతో వాగ్వాదానికి దిగిన భాస్కరాపురం గ్రామస్థులు

జూపాడుబంగ్లా, జూలై 20: ఉపాధి పనులపై చేపట్టిన సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక గందరగోళంగా మారింది. 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ చర్చా వేదిక జూపాడుబంగ్లాలోని ఉపాధి కార్యాలయం వద్ద నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 777 పనులకు సంబంధించి రూ.7.80 కోట్లతో జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో వారం రోజుల పాటు సర్వే నిర్వహించి చర్చ వేదిక నిర్వహించారు. మండలంలోని భాస్కరాపురం, 80బన్నూరు, తాటిపాడు, జూపాడుబంగ్లా గ్రామాల్లో పనిచేయకున్నా ఉపాధి సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు బిల్లులు వేసి అవకతవకలకు పాల్పడ్డారని, జాబ్‌కార్డులకు డబ్బులు వసూలు చేశారని వివిధ గ్రామాల ప్రజలు అధికారులను చర్చవేదికలో నిలదీశారు. సంబంధిత సిబ్బంది వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బహిరంగ చర్చ వేదికలో ఎన్నిసార్లు సాక్ష్యాలతో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, పట్టించుకోనప్పుడు చర్చవేదిక అనవసమని వివిధ గ్రామాల సర్పంచులు కూడా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ ఈకాంత్ 12 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు, వ్యయం, జరిగిన అవకతవకలపై డీఆర్‌పీలతో చర్చ వేదికలో వివరించారు. మొత్తం అవకతకలకు పాల్పడిన రూ.69,304, అపరాధ రుసుం కింద రూ. 5500, కొబ్బరి, నిమ్మ తదితర మొక్కలను రైతులకు అందజేసిన పొల్లాల్లో మొక్కలు లేకపోవడంతో ఖర్చుఅయిన మొత్తం రూ.25.60 లక్షలు రికవరీ చేయాలని, లేకపోతే మొక్కలులేని స్థానంలో మొక్కలు నాటాలని చర్చ వేదికలో వివరించారు. ఈసందర్భంగా పీడీ రామచంద్రారెడ్డి, అంబుడ్స్‌మన్ సురేంద్రకుమార్, విజిలెన్స్ జిల్లా అధికారి బాలాజీనాయక్, ఐతఈ భాస్కరనాయుడు మాట్లాడుతూ అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిబంధనలకు అతిక్రమించి అవకతకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. ఏపీడీ అన్వర్‌బేగం, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీవో నూర్జహాన్, ఏపీవో గౌరిబాయి తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబికాదేవికి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీశైలం, జూలై 20: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం పౌర్ణమి ఘడియలను పురస్కరించుకొని సాయంత్రం భ్రమరాంబికాదేవికి లక్ష కుంకుమార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో ముందుగా అర్చకులు పూజా సంకల్పం పఠించి అనంతరం మహాగణపతికి పూజలు చేశారు. తరువాత శాస్త్రోక్తంగా లక్ష కుంకుమార్చనను జరిపించారు. భక్తులు వారి గోత్రనామాలతో లక్షకుంకుమార్చనలో పాల్గొనేందుకు దేవస్థానం పరోక్ష సేవ ద్వారా అవకాశం కల్పించింది. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్రనామాలతో ఆయా ఆర్జితసేవలలో పాల్గొనేందుకు ఆన్‌లైన్ ద్వారా రూ. 1,116 లు సేవారుసుమును చెల్లించి పరోక్షసేవలో పాల్గొనవచ్చును. కాగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు మొత్తం 17 మంది భక్తులు ఈ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఈ పరోక్షసేవ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు సూచించారు.

వైభవంగా ఊయలసేవ: శ్రీశైల క్షేత్రంలో లోకకల్యాణార్థం పౌర్ణమిని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ఊయలసేవ, పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీనులనుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వైభవంగా ఉత్సవాన్ని నిర్వహించారు.

హుండీ ఆదాయం రూ.23.74 లక్షలు



కొత్తూరు దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

పాణ్యం, జూలై 20: మండలంలోని కొత్తూరు దేవస్థానం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. ఆలయ ఈవో రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన లెక్కింపులో రూ.23,74,402 నగదు, 3.97 గ్రాముల బంగారం, కిలో 427 గ్రాముల వెండి వచ్చినట్లు ఈవో తెలిపారు. నంద్యాల జిల్లా దేవదాయ శాఖ కార్యాలయ అధికారి చక్రభరత్ పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టినట్లు ఈవో తెలిపారు. గత మార్చి 30 నుంచి శనివారం వరకు వచ్చిన కానుకలను లెక్కించామని చెప్పారు. కార్యక్రమంలో మిలిటరీ సుబ్బారెడ్డి, శివరామిరెడ్డి, ప్రధాన అర్చకులు వీరయ్యస్వామి, వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐ రఫిక్, నందివర్గం ఏపీజీబీ సిబ్బంది తుషారిక, అఖిల్, అప్రయిజర్ మాధవస్వామి, నంద్యాల సాయి సేవా ట్రస్ట్ సభ్యులు, బేతంచెర్ల భజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఎస్పీ రఘువీర్‌రెడ్డికి ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీ రఘువీర్‌రెడ్డికి మొక్కను అందజేస్తున్న ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా తదితరులు

నంద్యాల క్రైం, జూలై 20: నంద్యాల ఎస్పీగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డికి జిల్లా పోలీస్ శాఖ ఆత్మీయ వీడ్కోలు పలికింది. శనివారం నంద్యాల పట్టణంలోని సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో ప్రస్తుత ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా ఆధ్వర్యంలో రఘువీర్‌రెడ్డిని పోలీస్ అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా మాట్లాడుతూ ఎస్పీ రఘువీర్‌రెడ్డి సమర్థవంతంగా కష్టపడి పనిచేశారన్నారు. ఎస్పీ రఘువీర్‌రెడ్డి సేవలను పలువురు పోలీస్ అధికారులు కొనియాడారు. అనంతరం రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ విధినిర్వహణలో తనకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సహాయసహకారాలు అందించిందని అన్నారు. ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా సిబ్బంది సహకారంతో అధిగమించామని తెలిపారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన హోంగార్డు స్థాయి నుంచి అడిషనల్ ఎస్పీ, పోలీస్ అధికారులందరికీ రఘువీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. వీడ్కోలు కార్యక్రమంలో డీఎస్పీలు జేవీ సంతోష్, వై.శ్రీనివాసరెడ్డి, ఎన్.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎ.శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

శ్రీశైలం, జూలై 20: శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నప్రసాద వితరణ పథకానికి శనివారం భక్తులు విరాళాలు అందజేశారు. గుంటూరుకు చెందిన మారంరెడ్డి భాస్కరరెడ్డి అనే భక్తుడు రూ. 1,00,116 విరాళాన్ని, హైదరాబాద్‌కు చెందిన చుండి రఘు కుమార్ రూ.లక్ష, సికింద్రాబాద్‌కు చెందిన పి.సుజాత రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు హిమబిందుకు అదజేశారు. దేవస్థానం అధికారులు దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

అలరించిన సంప్రదాయ నృత్యం

శ్రీశైలం, జూలై 20: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన లాస్యప్రియ నృత్యనికేతన్ కూచిపూడి డ్యాన్స్ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వినాయకకౌత్వం, నమశ్శివాయతే, నటరాజస్తోత్రం, అఖిలాండేశ్వరి, దేవిస్తుతి, భో..శంభో తదితర గీతాలకు కళాకారులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

'కత్తెర పురుగుతో జాగ్రత్త'

మహానంది, జూలై 20: మండలంలో మొక్కజొన్న సాగు చేసే రైతులు కత్తెర పురుగు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని తమ్మడపల్లి పొలాల్లో శనివారం మొక్కజొన్న పంటను ఏవో పరిశీలించారు. ఈసందర్భంగా పంట సాగులో మెళకువలతో పాటు చీడపురుగులు చేరకుండా నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీఏఏ మధు, రైతులు పాల్గొన్నారు.

'అతిసార ప్రబలకుండా చర్యలు'

ఆత్మకూరు రూరల్, జూలై 20: అతిసార ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. రుద్రకోడూరు గిరిజన గూడెంలో సంచార వైద్యశాల సిబ్బందితో కలిసి శనివారం చెంచులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల్లో జ్వరపీడితుల రక్తనమూనాలు సేకరించారు. చిరు వ్యాధులకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దోమల నివారణ కోసం తరగతి గదుల్లో మందు పిచికారీ చేయించారు. తాగునీటి ట్యాంకును శుభ్రం చేయించారు. సీహెచ్‌వో శివకుమార్, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, శారద, ఆశా కార్యకర్తలు ప్రమీల, నాగమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి : ఎంపీడీవో

అవుకు, జూలై 20: బాలికలు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీడీవో మల్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంఈవో వెంకటేశ్వరరెడ్డితో కలిసి అవుకు పట్టణంలోని కేజీబీవీ పాఠశాలకు చేరుకొని రికార్డులను, స్టోర్ గదిలోని సరుకులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌వో భవాని, సీఆర్‌పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెద్దవెంతుర్లలో కౌలు రైతుల గ్రామ సభ

కొలిమిగుండ్ల, జూలై 20: మండలంలోని పెద్దవెంతుర్ల, కోటపాడు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి ఆధ్వర్యంలో కౌలు రైతుల అవగాహన సదస్సులు శనివారం నిర్వహించారు. గ్రామాలకు చెందిన పలువురు కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తులు సమర్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నాగరాజు, వ్యవసాయ శాఖ సిబ్బంది స్నేహలత, సునియా పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో 480 మంది రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేసినట్లు తహసీల్దారు వెంకటరమణ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు 1530 మంది రైతులకు కౌలు కార్డులు అందించాల్సి ఉందన్నారు.

చాగలమర్రి: గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని ఏవో రంగనేతాజీ సూచించారు. శనివారం మండలంలోని నేలంపాడు గ్రామంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డు తప్పనిసరిగా పొందాలని అన్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో 480 మంది రైతులకు కౌలు కార్డులు పంపిణీ చేసినట్లు తహసీల్దారు వెంకటరమణ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌కు 1530 మంది రైతులకు కౌలు కార్డులు అందించాల్సి ఉందన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కోవెలకుంట్ల, జూలై 20: విద్యుత్ ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి వాటిని నివారించుకోవాలని కోవెలకుంట్ల విద్యుత్ ఏఈ రామ్మోహన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు బాగానే కురుస్తున్నాయన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్ తీగలు కిందకు వేలాడిన స్తంభాలు, విరిగిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

దొర్నిపాడు: ప్రజలు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోవెలకుంట్ల విద్యుత్ ఏఈ రామ్మోహన్ అన్నారు. శనివారం ఏఈ మాట్లాడుతూ ప్రతి ఇంటి విద్యుత్ సర్వీసుకు, ఇంటిలో ఉపయోగించుకునే పరికరాలకు ఎర్త్ వయరు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గృహాలలో ఏర్పాటు చేసుకున్న స్విచ్‌లు, హోల్డర్లు నాణ్యత కలిగి ఉండాలని అన్నారు.

ఉయ్యాలవాడ: విద్యుత్ ప్రమాదాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ ఏఈ గుర్రప్ప తెలిపారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సిబ్బంది, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ తడి చేతులతో మోటర్లను ఆన్ చేయరాదన్నారు.


చంద్రబాబు అరెస్టుతోనే జగన్ పతనం

కోవెలకుంట్ల, జూలై 20: ఎటువంటి మచ్చలేని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గత ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడంతో మాజీ ముఖ్యమంత్రి జగన్ పతనం అప్పుడే ప్రారంభమైందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికార గర్వంతో ఎటువంటి తప్పు చేయని చంద్రబాబు నాయుడుపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపించాడని ఆయన అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నాయకులు దోచుకున్నది దాచుకోవడం పనిగా చేశారని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై శ్వేత పత్రం విడుదల చేసి ప్రజల్లోకి తీసుకోచ్చేందుకు చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, టీడీపీ నాయకుడు గడ్డం అమర్‌నాథరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయం

శిరివెళ్ల, జూలై 20: అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమని టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. శిరివెళ్లలో ఆయన శనివారం పర్యటించారు. అనంతరం గ్రామానికి చెందిన జాకీర్ హుసేన్ గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన మృతదేహానికి విఖ్యాత్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు యామా గుర్రప్ప, నూరా రామ, బీసీ ఖాజా హుసేన్, బీసీ ఫిదా హుసేన్, బీఎండీ రఫి, సిద్ధిఖ్, యూనుస్, సికిందర్, తిరుమల రవి, బ్రహ్మయ్య, లింగమయ్య తదితరులు జాకీర్ హుసేన్ మృతదేహానికి నివాళి అర్పించారు.

కమ్మ సంఘం బలోపేతానికి కృషి చేయాలి



రాజశేఖర్ దంపతులతో నాయకులు

బేతంచెర్ల, జూలై 20: సమాజంలోని కమ్మ సంఘం బలోపేతానికి కమ్మ సంఘం నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా కృషి చేయాలని డోన్ నియోజకవర్గం కమ్మ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటకృష్ణారెడ్డి, పోలూరు విజయ రాఘవరావు పేర్కొన్నారు. శనివారం హైదరాబాదులో జరిగిన కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సుకు హాజరైన ప్రముఖ సినీ నటుడు రాజశేఖర్, ఆయన సతీమణి జీవితలను జిల్లా నాయకులు కలిశారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సుధాకర్, కిషోర్, డోన్ వినాయక చౌదరి, సత్యం, రవి, బాల నరసింహులు, పుల్లయ్య పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో సమస్యల మోత

శిరివెళ్ల, జూలై 20 : మండలంలోని గ్రామాల్లో వారం వారం నిర్వహించే మార్కెట్(సంత)లలో సమస్యలు తాండవిస్తున్నాయి. మార్కెట్‌లలో సరైన వసతులు లేకపోవడంతో విక్రయదారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. యర్రగుంట్ల, శిరివెళ్ల, మహదేవపురం గ్రామాల్లో మార్కెట్‌లు ఉన్నాయి. వీటికి గ్రామ పంచాయతీలు నిర్వహించే బహిరంగ వేలంపాటల ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతున్నప్పటికీ అధికారులు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శిరివెళ్ల, యర్రగుంట్ల గ్రామాల్లోని మార్కెట్‌లకు ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో వక్ఫ్‌బోర్డు స్థలంలో, ప్రధాన రహదారిపైనే సంత నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో మార్కెట్లలో నీళ్లు నిలుస్తుండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



శిరివెళ్లలో బురదమయంగా మారిన వారపుసంత



వర్షాకాలంలో శిరివెళ్ల మార్కెట్ దుస్థితి

వర్షం పడితే బురదమయంగా మారుతున్న సంతలు
శిరివెళ్ల, యర్రగుంట్లలో ప్రధాన రహదారిపైనే విక్రయాలు
రూ.లక్షల్లో ఆదాయం ఉన్నా.. కానరాని అభివృద్ధి

ఆదాయం ఉన్నా.. అభివృద్ధి శూన్యం



సంత వేలంపాటల ద్వారా గ్రామ పంచాయతీలకు ఏటా లక్షల రూపాయల ఆదాయం సమకూరుతున్నా.. అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందాన మారింది. శిరివెళ్లలోని సంతమార్కెట్‌లు, కబేళా ద్వారా 2019-20 నుంచి 2024-25 వరకు ఆరు సంవత్సరాలకు గాను గ్రామ పంచాయతీకి రూ.74.65 లక్షల ఆదాయం చేకూరింది. యర్రగుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దినసరి మార్కెట్, వారపు సంత, కబేళా ద్వారా 2019-20 నుంచి 2024-25 వరకు ఆరు సంవత్సరాలకు గాను రూ.65.56 లక్షల ఆదాయం వచ్చింది. అలాగే మహదేవపురం పంచాయతీలో వారపు సంతకు 2019-20 నుంచి 2024-25 వరకు రూ.31.84 లక్షల ఆదాయం వచ్చింది. ప్రభుత్వ స్థలాలు లేకపోవడంతో యర్రగుంట్లలో ప్రతి బుధవారం గ్రామంలోని ప్రధాన రహదారిలో, శిరివెళ్లలో ప్రతి ఆదివారం వక్ఫ్‌బోర్డు స్థలంతో పాటు ప్రధాన రహదారిలో సంత నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో మార్కెట్‌లలో కూరగాయలు, నిత్యావసర వస్తువులు విక్రయించుకోవాలన్నా.. కొనుగోలు చేయాలన్నా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ప్రత్యేక స్థలం కేటాయించాలి :



శిరివెళ్లలో సంత మార్కెట్ నిర్వహించేందుకు ప్రత్యేక స్థలం కేటాయించి వసతులు కల్పించాలి. ప్రస్తుతం వక్ఫ్‌బోర్డు స్థలంలో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అక్కడ ఎలాంటి సదుపాయాలు లేవు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
సులేమాన్, శిరివెళ్ల

సదుపాయాల కల్పనకు కృషి

శిరివెళ్ల, యర్రగుంట్ల, మహదేవపురం గ్రామాల్లోని మార్కెట్‌లలో సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. స్థలాల కొరతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
నాగేంద్రుడు,
ఈవోపీఆర్డీ

కురుస్తున్న వాన

నీటి కుంటలుగా రహదారులు



నీటి కుంటగా డి.వనిపెంట రహదారి



చాగలమర్రిలో గుంతల్లో నిల్వ ఉన్న వర్షపునీరు

చాగలమర్రి, జూలై 20: చాగలమర్రి మండలంలో రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేని మోస్తారు వర్షం కురిసింది. శనివారం 20 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షంతో డి.వనిపెంట, కొత్తపల్లె, ఓజీ తాండ, చాగలమర్రి గ్రామాల్లో రహదారులు నీటి కుంటలుగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వాడుముఖం పట్టిన మొక్కజొన్నకు ఈ వర్షం ఊపిరి పోసింది. వర్షం కురవడంతో వరి నారుమల్లు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. అలాగే గ్రామీణ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

70.6 మి.మీ. వర్షపాతం నమోదు

రుద్రవరం: రుద్రవరం మండలంలో శనివారం 70.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షం కురియడంతో వాగులు, వంకలు జలకళ సంతరించుకున్నాయి. పంటపొలాల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. వాగులు, వంకల వెంట ప్రవహించిన వర్షపు నీరు చెరువులకు చేరింది. దీంతో చెరువులకు జలకళ సంతరించుకుంది.

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల మండలంలోని వివిధ గ్రామాలలో ఓ మోస్తారు వర్షం కురిసింది. మండలంలోని వివిధ గ్రామాల్లో 8.6మి.మీ స్వల్ప వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో భాస్కరరెడ్డి శనివారం వెల్లడించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి.



కొలిమిగుండ్లలో కురుస్తున్న వర్షం

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలి

బనగానపల్లె , జూలై 20: బనగానపల్లె మండలంలోని పలుకూరు గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఎనకండ్ల ఆంజనేయస్వామి ఆలయం వరకు రోడ్డు మధ్యలో వేసిన డివైడర్ తొలగించిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు గుండం మల్లిఖార్జునరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం బనగానపల్లె గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఈవో శ్రీనివాసులుకు వినతిపత్రం సమర్పించారు. 2015 టీడీపీ హయంలో ప్రభుత్వ నిధుల ద్వారా సీసీ రోడ్డు, రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ డివైడర్‌ను వైసీపీ నాయకడు శనివారపు వెంకటరామిరెడ్డి, శనివారపు దస్తగిరిరెడ్డి తొలగించారన్నారు. తొలగించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీ ఇందిరమ్మను కలిసిన మైనార్టీ నాయకులు



బీసీ ఇందిరమ్మకు ప్రసాదం అందజేస్తున్న నాయకులు

బనగానపల్లె , జూలై 20: బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందడంతో బనగానపల్లె పట్టణానికి చెందిన టీడీపీ మైనార్టీ నాయకులు ఎస్ ఎండీ రఫీ ఆధ్వర్యంలో నెల్లూరు పట్టణంలోనిబారాషాహీద్ బాబా దర్గా వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని బీసీ ఇందిరమ్మను కలిసి దర్గా ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు అన్వర్‌సాహెబ్, మొహమ్మద్, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, ఆరిఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సంజామల, జూలై 20: మండలంలోని ఆకుమల్ల గ్రామంలో శనివారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. కోవెలకుంట్ల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నిర్వాహకులు ఈశ్వర్‌నాయక్ ఆధ్వర్యంలో బ్యాంకు సేవలు, సైబర్ నేరాలు, సైబర్ మోసాలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు , బ్యాంకు ఖాతాలు , ఖాతా ద్వార పొందే ఇన్సురెన్స్‌లు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు.

నిందితులను శిక్షించాలి



నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ, జూలై 20: శ్రీదేవిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఐటీ మంత్రి నారాలోకేష్‌ను దివంగత శ్రీదేవి కుమారుడు అట్ల హర్షవర్ధనరెడ్డి, కుమార్తె రమశ్రీ కోరారు. శనివారం మంగళగిరిలో కలిసి వినతి పత్రం ద్వారా ప్రజాదర్బార్‌లో కోరారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

దొర్నిపాడు, జూలై 20: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3,180 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'పారిశుధ్యంపై దృష్టి సారించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

రుద్రవరం, జూలై 20: మండలంలో వర్షాలు కురుస్తున్నాయని, కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఈవోపీఆర్డీ శ్రీనివాసశర్మ సూచించారు. మండలంలోని నరసాపురం గ్రామంలో శనివారం పారిశుధ్య పనులను పరిశీలించారు. సచివాలయాల్లో సరైన రికార్డులు చూపని కార్యదర్శులకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఉన్నతాధికారులకు క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు ఆయన తెలిపారు.

ప్యాపిలి: గ్రామాల్లో పరిశుభ్రతపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో సాయిమనోహర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఆయన పంచాయితీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన రోడ్లపై పేరుకపోయిన పారిశుధ్యం తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, పంచాయితీ కార్యదర్శులు నాగయ్య, ఫ్రాన్సీస్, నాగభూషణం, పార్ధసారధిరెడ్డి, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పంటలను కాపాడుకోవాలి'

రుద్రవరం, జూలై 20: రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పంటలను కాపాడుకోవాలని ఏవో శ్రీకృష్ణ సూచించారు. రుద్రవరంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. పంటలు కాపాడుకోవడం గురించి శనివారం రైతులకు వివరించారు. నిర్లక్ష్యం చేస్తే పంటలు దెబ్బతింటాయన్నారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.2.02లక్షలు

బేతంచెర్ల, జూలై 20: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.2.02 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే గాక. ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

హెల్మెట్ల అందజేత

కొలిమిగుండ్ల, జూలై 20: మండలంలోని బెలుంగుహల సిబ్బందికి దాతలు హెల్మెట్లను అందజేశారు. శనివారం కడప జిల్లా పులివెందుల సమీపంలోని యూరేనియం పరిశ్రమ అధికారులు ఖలీల్ తదితరులు బెలుంగుమల సిబ్బందికి హెల్మెట్లు పంపిణీ చేశారు. మొత్తం 30 హెల్మెట్స్ అందించినట్లు గుహల యూనిట్ సిబ్బంది తెలిపారు. దీంతో దాతలను ఘనంగా సన్మానించారు. మేనేజర్ అమరనాథరెడ్డి, బాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కొలిమిగుండ్ల, జూలై 20 : మండలంలోని వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు, సమ దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని మండల విద్యాధికారులు ప్రారంభించారు. పెండింగ్ పుస్తకాలతో పాటు, విద్యార్థులకు బ్యాగులు, బూట్లు, బెల్టులు తదితర వాటిని అందజేస్తున్నట్లు ఎంఈవో అబ్దుల్‌కలాం పేర్కొన్నారు.

ఏఈపై కేసు నమోదు

రుద్రవరం, జూలై 20: రుద్రవరం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి శుక్రవారం ట్రాక్టర్‌లో విద్యుత్ పరికరాలు తరలింపుపై ఇన్‌చార్జి ఏఈ రాకేష్‌గౌడ్ శనివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఈ రాఘవేంద్రారెడ్డితో పాటు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు. ట్రాక్టర్‌లో ఎర్తుపైపులు 8, త్రిఫేస్ కాసారాలు 35 తరలించినట్లు గుర్తించారు. వీటి విలువ రూ.48,360 అని విద్యుత్ అధికారులు వెలకట్టారు. రవాణాకు ఉపయోగించే ట్రాక్టర్‌ను స్టేషన్‌లో ఉంచినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ప్రత్యేక హోదా సాధించాలి

డోన్(రూరల్), జూలై 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్‌లు డిమాండ్ చేశారు. శనివారం నంద్యాల జిల్లాలో జరుగుతున్న జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి డోన్ నుంచి సీపీఎం నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు ఎస్‌పి చిన్న రెహిమాన్, నక్కి హరి, శివరాం, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ తనిఖీ



డోన్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ డా.జయరాం

డోన్, జూలై 20: పట్టణంలోని 32వ వార్డులో మినరల్ వాటర్ ప్లాంటును శనివారం మున్సిపల్ కమిషనర్ డా.జయరాం అకస్మికంగా తనిఖీ చేశారు. శుద్ధజలం తయారు చేస్తున్న విధానాన్ని కమిషనర్ సంబంధిత యజమానితో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిబంధనలు పాటించి వాటిని తక్షణమే మినరల్ వాటర్‌ను సరఫరా చేయాలని కమిషనర్ ఆదేశించారు. వార్డుల్లో ఎన్‌పీ-3 పైపు కల్వర్టు పూడిపోయినందు వలన చిన్న పైపులను తీసేసి వాటి స్థానంలో పెద్ద పైపులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కుష్ఠువ్యాధిపై ఇంటింటి సర్వే



డోన్‌లో కేసులను పరిశీలిస్తున్న డాక్టర్లు

చాగలమర్రి, జూలై 20: కుష్ఠువ్యాధి లక్షణాలు తెలుసుకోవడానికి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు సుల్తాన పేర్కొన్నారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో ఆరోగ్య కేంద్రంలో శనివారం కుష్ఠువ్యాధి లక్షణాలు గురించి అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, డయేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కుష్ఠువ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో నర్మద, ఏఎన్ఎం నూర్జాహాన్, హెచ్‌ఏ మనోహర్ పాల్గొన్నారు.

డోన్(రూరల్): కుష్ఠువ్యాధి (లెప్రసీ) లక్షణాలు కలిగి ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రాంభూపాల్, నోడల్ పర్సన్ కే.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మండలంలోని కొత్తబురుజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తాడూరు గ్రామంలో ఒక అనుమానపు కేసును వైద్యులు గుర్తించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.ప్రణీత్ కుమార్, సిస్టర్ ఎం.దుర్గమ్మ, ఆశా వర్కర్ ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆర్యోగ కేంద్రం పరిధిలో కుష్ఠు వ్యాధిగ్రస్థుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి బాబు తెలిపారు. శనివారం సర్వేను పరిశీలించారు.

రూ.160కే కందిపప్పు

చాగలమర్రి, జూలై 18: గ్రామాల్లోని దుకాణదారులు కంది పప్పు కిలో రూ.160 విక్రయించాల్సి ఉంటుందని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. శనివారం ఆమె మాట్లాడుతూ కందిపప్పు ప్రభుత్వం నుంచి ఆయా దుకాణాలకు సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారమే కందిపప్పు ప్రజలకు విక్రయించాలని అన్నారు. సోన మసూర బియ్యం కిలో రూ.48 ప్రకారం ప్రజలకు అందించాలని అన్నారు. సివిల్ సప్లయ్ ద్వార దుకాణాలకు కందిపప్పు సరఫరా చేయడబడుతుందని అన్నారు. వీఆర్వోలు దుకాణాల వద్దకు వెళ్లి స్టిక్కర్లను తగిలించారు. కార్యక్రమంలో వీఆర్వోలు బాబయ్య, విశ్వనాథ్, పరమేశ్వర, సాయి ఉన్నారు.

పెండింగ్ బకాయిలు మంజూరు చేయాలి



చాగలమర్రి పోస్టాఫీసు ముందు పోస్టర్లతో డిమాండ్ చేస్తున్న ఉద్యోగులు

చాగలమర్రి, జూలై 20: తపాలా ఉద్యోగుల పెండింగ్ బకాయిలను మంజూరు చేయాలని సబ్ పోస్టుమాస్టర్ మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం చాగలమర్రి పోస్టాఫీసు ముందు తపాలా ఉద్యోగులు పోస్టర్లు చేతపట్టి డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కాన్ఫిడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చిన పిలుపు మేరకు లంచ్ సమయంలో ఆందోళన చేపట్టారు. 8 డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఎన్‌పీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, 8వ వేతనం సంఘం ఏర్పాటు, కరోనా సమయంలో నిలిపి వేసిన 18 నెలల డీఏ బకాయిలు, జీడీఎస్ క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు నాణ్యతగల భోజనం ఇవ్వాలి

చాగలమర్రి, జూలై 20: విద్యార్థులకు నాణ్యతగల భోజనం ఇవ్వాలని నోడల్ అధికారి, ఎంఈవో న్యామతుల్ల సూచించారు. శనివారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం తయారు చేయాలని అన్నారు. నాణ్యత లోపించకుండా భోజనం తయారు చేయాలని ఏజెన్సీ మహిళలకు ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయిణిలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లలిత పారాయణం

చాగలమర్రి, జూలై 19: చాగలమర్రి గ్రామంలోని కోదండ రామాలయంలో ఆషాడమాసం సందర్భంగా శనివారం మహిళలు సామూహికంగా లలిత సహస్రపారాయణం నిర్వహించారు. పండ్లు, కూరగాయలు, ఆకులతో పార్వతిదేవి, అమ్మవారిని అలంకరింప చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకారంలో కొలువుదీరారు. వెండి రథంతో పల్లకి ఉత్సవం చేశారు.

అభయం ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజ

ఉయ్యాలవాడ, జూలై 20: మండలంలోని ఆర్.జంములదిన్నె గ్రామ మెట్టు వద్ద వెలసిన అభయ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కీర్తిలక్ష్మణస్వామి స్వామి వారికి అబిసేకం, అలంకరణ చేశారు. అనంతరం ఆకుపూజ, కుంకుమార్చన, గణపతి పూజ చేసి స్వామి వారికి నైవేద్యం పెట్టారు. కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, జూలై 20: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, లక్ష్మీ గోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి, త్రిపురసుందరీదేవి అమ్మవార్లకు శనివారం అర్చకులు వారణాశి గోపిశర్మ, శివశర్మ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

వైభవంగా పౌర్ణమి దినోత్సవం



చాగలమర్రి రామలింగేశ్వర ఆలయంలో దీపోత్సవం చేస్తున్న మహిళలు, టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూలై 20: చాగలమర్రి గ్రామంలోని రామలింగేశ్వర ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల సందర్భంగా శనివారం రాత్రి మహిళలు సామూహిక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శివపార్వతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. విష్ణు సహస్రపారాయణం నిర్వహించారు. 108 దీపాలచే శివపార్వతులకు ప్రత్యేక హారతులు చేశారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నంద్యాల స్పోక్‌పర్సన్ సల్లానాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, శంకరసుబ్బారావు, మహిళలు పాల్గొన్నారు.